క్లుప్తంగా

ముమ్మరంగా సీసీరోడ్ల నిర్మాణ పనులు



పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కోసిగి: మండల కేంద్రంలోని వీధుల్లో సీసీరోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే నిధులు రూ.5 లక్షలతో సిద్ధప్పపాళెం చాకలిగేరి, కట్టలగేరి కాలనీలో జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. హొలగుంద కోసిగయ్య, యల్లయ్య, రాజేష్, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఘనంగా శంఖచక్ర ప్రతిష్టాపన



పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సభ్యులు

కోసిగి: స్థానిక సిద్ధప్పపాళెంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో బుధవారం శంఖచక్ర ప్రతిష్టాపక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి ఆర్యవైశ్య సంఘం పెద్దలు ఇల్లూరి శ్రీనివాసులు, ఇల్లూరి ఆదినారాయణ ఆధ్వర్యంలో గణపతి పూజ, నవగ్రహ పూజ, హోమ పూజలు చేశారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ లక్ష్మీదేవి, నాయకులు, కార్యకర్తలు

ఆదోనిటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు పరిధిలో 210 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను బుధవారం సచివాలయం వద్ద కౌన్సిలర్ ఎస్.పి.లక్ష్మీదేవి, వార్డు ఇన్‌చార్జ్ నగరూరు గద్దం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సహాయ సహకారాలతో 210 మందికి పైగానే జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలను కేటాయించి, వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించడం చరిత్రలో మరిచిపోలేని రోజని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు.

ఉత్సాహంగా తరంగ్



ఉల్లాసంగా డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

ఆదోనిఅర్బన్: పట్టణంలో కిడ్డీస్ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా బుధవారం పాఠశాల డైరెక్టర్లు కేశవనారాయణరెడ్డి, చెన్నపరెడ్డి ఆధ్వర్యంలో తరంగ్ 2024 కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. 1వ తరగతి నుంచి 6వ తరగతి విద్యార్థులు సినీ పాటలకు చిందులు వేస్తూ అలరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

చిరుత దాడిలో రెండు గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రె

కోసిగి: మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో నరసప్పగారి కోతయ్యకు చెందిన రెండు గొర్రెలు చిరుత దాడిలో మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం రాత్రి గొర్రెల మందను గ్రామ శివారులోని కొండ పొలంలో ఉంచామన్నారు. చిరుత రెండు గొర్రెలపై దాడి చేసి ఒకదాన్ని కొండ ప్రాంతంలోకి లాక్కెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు. పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి సంతోష్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనురాధ సంఘటనా స్థలానికి వెళ్లి గొర్రె కళేబరానికి పోస్టుమార్టం చేశారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా చూస్తామన్నారు.

అనారోగ్యంతో వీఏఏ మృతి



శిల్ప (ఫైల్)

కౌతాళం: మండలంలోని ఎరిగేరి సచివాలయంలో వీలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శిల్ప (25) బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతిపై మండల వ్యవసాయాధికారి శేషాద్రి, ఉద్యోగులు సంతాపం తెలిపారు.

పౌష్టికాహారం.. తల్లీబిడ్డల ఆరోగ్యం

- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ'
- ఇంటి వద్దకే సరుకులు
- హర్షం వ్యక్తం చేస్తున్న బాలింతలు, గర్భిణులు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందుకున్న బాలింతలు, గర్భిణులు

ఆదోని సెంట్రల్: మాతృమూర్తుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ప్రజల చెంతకే వైద్య సేవలను అందిస్తూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద సరకులను పంపిణీ చేస్తోంది. నెలకు సరిపడా సరకులను ఇంటికే అందజేయడంతో ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరుస్తోంది.

ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

పేదరికంలో ఉన్న గర్భిణులకు గత ప్రభుత్వ హయాంలో సరైన పోషకాహారం అందక రక్తహీనతకు గురైన సందర్భాలు ఉన్నాయి. దీంతో పుట్టిన పిల్లలు అనారోగ్య సమస్యలతో సతమతమయ్యేవారు. ప్రజల ఆరోగ్యంపై అప్పటి పాలకులు కనీసం పట్టించుకోలేదు. దీంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ పరిస్థితిని రూపుమాపేందుకు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలు, చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా పోషకాహారాన్ని అందిస్తోంది. ఇంటింటికీ వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు వచ్చి ఆరోగ వివరాలను సేకరిస్తున్నారు. మాత శిశు మరణాల నివారణకు ఈ పథకాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తోంది.

224 అంగన్‌వాడీ కేంద్రాలు

ఆదోని నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో 98, పట్టణ ప్రాంతంలో 126 మొత్తం 224 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 6 నెలలు నుంచి 3 సంవత్సరాలలోపు పిల్లలు 13,254 మంది ఉన్నారు. 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల పిల్లలు 7,761 మంది, గర్భిణులు 2,811 మంది, బాలింతలు 2,706 మంది ఉన్నారు. గర్భిణులకు గతంలో ఇచ్చే పప్పు, పాలు, గుడ్లకు తోడు మరో ఆరు రకాల పోషక పదార్థాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో వారి ఇళ్లకే అందజేస్తుంది. గ్రామ గ్రామాన ప్రతి నెలా అందిస్తుండడంతో మహిళల్లో రక్తహీనత సమస్య తగ్గి ఆరోగ్యంతమైన శిశువులు జన్మిస్తున్నారు. తల్లులు ఆరోగ్యవంతమైన సమాజానికి ప్రభుత్వం బీజం వేసింది.

సంపూర్ణ పోషణ కిట్‌లోని సరకులు..

బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ద్వారా ప్రతి నెలా సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తోంది. కిలో కంది పప్పు, అర లీటరు పామాయిల్, 3 కిలోల ఫోర్టిఫైడ్ రైస్, 250 గ్రాముల ఎండు ఖర్జురాలు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల వేరుశనగ చిక్కీలు, కిలో మల్టీగ్రెయిన్ ఆటుకులు, కిలో రాగిపిండి. 5 లీటర్ల పాలు, 25 కోడిగడ్లతో కూడిన కిట్లును అందజేస్తోంది. తల్లులకు మాత్రమే కాకుండా ఏడు నెలలు నుంచి మూడేళ్ల వయస్సు గల పిల్లలకు నెలకు రెండున్నర కిలోల బాలమృతం, రెండున్నర లీటర్ల పాలు, 25 కోడి గుడ్లను అంజేస్తోంది. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు అంగన్ వాడీ కేంద్రాలలోనే వంట వండి వడ్డిస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

మెను ఇలా..

- సోమవారం, గురువారాల్లో.. కూరగాయలతో కూర, సాంబార్, కోడిగుడ్డు, పాలు
- మంగళవారం, శుక్రవారాల్లో: పప్పు, తోట కూర, కోడిగుడ్డు, 100ఎంఎల్ పాలు
- బుధవారం, శనివారాల్లో: వెజిటెబుల్ రైస్, పులిహోర, గోంగూర కూర, కోడి గుడ్డు, 100 ఎంఎల్ పాలు

క్రమం తప్పకుండా ఇస్తున్నారు



అంగన్‌వాడీ కేంద్రం నుంచి ప్రతి నెలా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను క్రమం తప్పకుండా ఇస్తున్నారు. మొదటి, రెండో కాన్పులో మాకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదు. పిల్లలు ఇద్దరూ ఆరోగ్యవంతులుగా జన్మించారు. అంగన్‌వాడీ కార్యకర్తతో పాటు నర్సులు ఎప్పటికప్పుడు మా ఆరోగ్య సమస్యలను తెలుసుకుని తగిన సలహాలు, సుచనలను అందిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషణ, వైద్య సేవలపై చాల ఆనందంగా ఉంది.

– మహాలక్ష్మి, ఆదోని

నిబంధనల ప్రకారం పంపిణీ

ప్రభుత్వ నిబంధనల ప్రకారం గర్భిణీ, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్లును అందిస్తున్నాం. మూడేళ్లపై బడిన పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలోనే భోజనం వడ్డిస్తున్నాం. పేద మధ్య తరగతి మహిళలు రక్తహీనతతో బాధపడకూడదని ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తోంది.– **ఉమామహేశ్వరి సీడీపీఓ, ఆదోని**

శ్రీశైలానికి శివస్వాములు



ఇరుముడితో బయలు దేరిన శివస్వాములు

పెద్దకడబూరు: మండల కేంద్రంలో శివమాల ధరించిన భక్తులు బుధవారం శ్రీశైలం ప్రయాణమయ్యారు. అంతకుముందు గురుస్వామి నాగరాజు స్వామి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి కట్టుకున్నారు. గ్రామస్తులు మంగళవాయిద్యాల నడుమ గ్రామ పొలిమేర వరకు వెళ్లి వారిని సాగనంపారు.

శభాష్ వలంటీర్



కర్ణాటకకు వెళ్లి ఈకేవైసీ చేస్తున్న వలంటీర్ రాఘవేంద్ర

కౌతాళం: మండల పరిధిలోని ఉప్పరహాల్ గ్రామానికి చెందిన మహంకాలమ్మ పనుల నిమిత్తం కర్ణాటకలోని శిరిగేరికి వెళ్లింది. ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేసి ఇస్తుండగా ఆమె గ్రామంలో లేదు. విషయం తెలుసుకున్న వలంటీర్ రాఘవేంద్ర 150 కిలోమీటర్ల దూరం ఉన్న శిరిగేరికి వెళ్లి మహకాంలమ్మ వద్ద ఈకేవైసీ చేయించి ఆమెకు రిజిస్ట్రేషన్ పత్రం అందించి వచ్చాడు. దీంతో ఆమె ఆనందం వ్యక్తం చేసింది. వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపింది. వలంటీర్ వ్యవస్థ ద్వారా తమకు ఎంతో లబ్ధి కలుగుతోందని పేర్కొంది. ప్రభుత్వానికి రుణపడి ఉంటానని తెలిపింది.

మండలానికి రూ. 16.34 కోట్ల పంటనష్ట పరిహారం



మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పురుషోత్తంరెడ్డి

పెద్దకడబూరు: మండలానికి రూ. 16.34 కోట్ల పంట నష్టపరిహారం మంజూరైనట్లు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పురుషోత్తంరెడ్డి, వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. 2023 ఖరీఫ్‌లో కరువు కారణంగా పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. నష్టపోయిన రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాలోకే పంటనష్ట పరిహారం వేసినట్లు తెలిపారు. మండలంలో సుమారు 15,000 రైతులకు రూ.16.34 కోట్లు లబ్ధి చేకూరనున్నట్లు వెల్లడించారు.

పంట	రైతులు	విస్తీర్ణం (హెక్టార్లు)	నగదు జమ
పత్తి	8083	5785.72	983,57,240
మిరప	5619	3141.284	534,01,828
వేరుశనగ	761	426.63	72,52,710
ఆముదము	388	230.16	19,56,360
కంది	509	97.24	9,72,400
ఉల్లి	85	36.49	6,20,330
సజ్జ	112	41.06	3,49,010
కొర్ర	48	21.42	1,82,070
మొక్కజొన్న	17	11.41	1,42,62
వరి	19	5.6	95,200
జొన్న	23	5.48	46,580
టమోట	8	2.26	38,420
నువ్వులు	2	0.17	1,445
మొత్తం	15670	9804.924	16,34,16,218

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



గ్రావెల్‌రోడ్డుకు భూమి పూజ చేస్తున్న నాయకులు

కౌతాళం: గ్రామాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ బాపురం గ్రామ ఇన్‌చార్జి గురనాథ్ రెడ్డి, కుమార్‌గౌడ్ అన్నారు. బాపురం సచివాలయ పరిధిలోని డంబలదిన్నె గ్రామంలో పెద్ద వంకకు వెళ్లే రస్తాకు ఎంపీపీ నిధులు రూ.3 లక్షలతో గ్రావెల్‌రోడ్డుకు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో నుంచి పెద్ద వంకకు వెళ్లే రస్తాకు ఇరువైపులా ముళ్లకంపలు తొలగించి గ్రావెల్‌రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి మండల పరిషత్ గ్రాంట్ నుంచి నిధులు మంజూరు చేయించడంతో పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇప్పటికే గ్రామంలో పలు అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ నాగన్నగౌడ్, దివాకర్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, నర్సిరెడ్డి, హనమయ్య, వీరేష్‌ఆచారి పాల్గొన్నారు.

రైతన్నలకు పంట నష్టపరిహారం



రామళ్లకోట ఆర్బీకేలో సీఎం వైఎస్ జగన్ ప్రసంగాన్ని లైవ్‌లో తిలకిస్తున్న రైతులు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలో గత ఖరీఫ్‌లో 18706 మంది రైతులు కంది, పత్తి, వేరుశనగ, ఆముదం, మొక్కజొన్న, కొర్ర, సజ్జ, ప్రొద్దుతిరుగుడు, ఉద్యాన పంటలు పచ్చిమిర్చి, ఉల్లి, టమాటా తదితర పంటలు సాగుచేసి వర్షాభావ పరిస్థితుల కారణంగా నష్టపోవడంతో ప్రభుత్వం రూ.15.36 కోట్ల పరిహారాన్ని రైతుల ఖాతాల్లో జమచేసినట్లు ఏఓ అక్బర్ బాషా తెలిపారు. ఈ మేరకు బుధవారం సీఎం జగన్‌మోహన్ రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి డీబీటీ ద్వారా ఇన్‌పుట్ సబ్సిడీని జమ చేశారు. ఈ సదర్భంగా సీఎం ప్రసంగాన్ని వెల్దుర్తి ఆర్బీకేలో టీవీ ద్వారా లైవ్‌లో ఏఓ అక్బర్‌బాషా, సర్పంచ్ నిర్మల, వీఏఏ సాంబశివుడు ఆధ్వర్యంలో రైతులు వీక్షించారు. రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎంగా ఉండడం తమ అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు.

మద్దికెర: మండలంలో ఖరీఫ్–2023 సీజన్‌కు సంబంధించి 5775 హెక్టార్ల పంటలకుగాను 6826 మంది రైతులకు రూ.7 కోట్లు నష్టపరిహారం మంజూరైనట్లు ఏఓ రవి తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో సీఎం వైఎస్ జగన్ ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.

కృష్ణగిరి: ఖరీఫ్–2023 సీజన్‌కు సంబంధించి వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు నష్టపోయిన రైతుల ఖాతాల్లో పరిహారం సొమ్ము జమైనట్లు పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్, ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. టి.గోకులపాడు రైతు భరోసా కేంద్రంలో వారు రైతులతో కలిసి సీఎం ప్రసంగాన్ని తిలకించారు. మండలంలో 19,697 మంది రైతుల ఖాతాలకు రూ.21,56,60,785 జమ కావడం జరిగిందన్నారు. పంట నష్టపోయిన రైతులకు సీజన్ ముగిసేలోపే పరిహారం అందించడంతో సీఎం జగనన్నకు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

హొళగుంద: మండలంలోని 24 గ్రామాలలో 8,657.38 హెక్టార్లలో వివిధ పంటలు సాగుచేసి నష్టపోయిన 8,819 మంది రైతులకు ప్రభుత్వం రూ.14,67,08,805 పరిహారం మంజూరుచేసింది. పత్తి, మిరప, వేరుశనగ పంటలకు హెక్టారుకు రూ.17 వేలు, మిగతా పంటలకు రూ.8,500 చొప్పున పరిహారం అందిస్తున్నట్లు ఏఓ ఆనంద్ లోకదళ్ తెలిపారు.

ట్యాబ్‌ని ఉపయోగించుకుని ఉన్నతస్థాయికి ఎదగాలి



విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ ప్రహ్లాద యాదవ్, ఉపాధ్యాయులు

ఆదోనిరూరల్: విద్యార్థులు బైజూస్ కంటెంట్‌తో ఉన్న ట్యాబ్‌ని ఉపయోగించుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని విరుపాపురం సర్పంచ్ ప్రహ్లాదయాదవ్ సూచించారు. బుధవారం మండలంలోని విరుపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 180 మంది విద్యార్థులకు సర్పంచ్ చేతులమీదుగా ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రయివేట్ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. విద్య, వైద్య రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రేపురేఖలను మార్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థినీ, విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10న బండలాగుడు పోటీలు

ఆస్పరి: మహాశివరాత్రి పండుగ పురస్కరించుకుని మండలంలోని బిణిగేరి గ్రామంలో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా ఈనెల 10వ తేదీన రాష్ట్రస్థాయి వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వృషభాల యజమానులు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 81794 69377, 95730 12831 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

చిప్పగిరి: మండలంలోని 29 పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ పద్మజ ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలింగ్ బూత్‌లలో శుభ్రత, సౌకర్యాల కల్పనలో లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ బరెన్ సాహెబ్, ఈఓపీఆర్డీ బాలన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

హొళగుంద: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో గొడవలు, అల్లర్లు సృష్టించి ప్రశాంతతకు భంగం కలిగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఆయన బుధవారం రాత్రి హొళగుంద ఎస్ఐ పెద్దయ్యనాయుడుతో కలిసి ఎల్లార్తిలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, సమస్యాత్మక గ్రామమైన ఎల్లార్తిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నేర చరిత్ర కలిగిన వారి కదలికలపై నిఘా ఉంచామన్నారు. ఓటర్లను భయపెట్టడం, ప్రలోభాలకు గురి చేయడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మార్లమడికి వద్ద ఉన్న సెబ్ చెక్‌పోస్టును పరిశీలించి కర్ణాటక నుంచి అక్రమ మద్యం, డబ్బు రవాణా జరగకుండా గస్తీ పటిష్టం చేయాలని సిబ్బందికి సూచించారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

ఆలూరు రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నట్లు మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి అన్నారు. ఆయన బుధవారం ఆలూరులోని సచివాలయం-3 పరిధిలో రోగులకు వైద్య సేవలందించారు. 90 మంది వృద్ధులు, గర్భిణులకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎం యశోద, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

బ్రహ్మగుండంలో మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

వెల్దుర్తి(కృష్ణగిరి): బ్రహ్మగుండం క్షేత్రంలో ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం వెల్దుర్తి సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ సీసీ కెమెరాల పనితీరు మెరుగుపరచాలని చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి, ఆలయ సిబ్బందికి సూచించారు.జాగరణ, కల్యాణం, రథోత్సవం, బండలాగుడు పోటీలకు హాజరయ్యే భక్తులు, ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలు, పార్కింగ్ వివరాలపై చర్చించి తగు సూచనలు చేశారు. ఆలయ సిబ్బంది మద్దిలేటి, నాయకులు రఘురెడ్డి, ఎల్లయ్య ఉన్నా రు. ఉత్సవాల్లో విద్యుత్ అసౌకర్యం కలగకుండా వెల్దుర్తి ఏఈ రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో తీసుకుంటు న్న చర్యలను డోన్ ఈఈ ప్రసాద్ రెడ్డి పరిశీలించారు. 200 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా ఉత్సవాలకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. సిబ్బంది లోపాలను సరిదిద్దుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పేదలకు వరం 'ఆరోగ్య సురక్ష'



పల్లెపాడులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు



రోగులకు అందుబాటులో ఉంచిన మందులు

కోసిగి: జగనన్న ఆరోగ్య సురక్ష.. పేదల పాలిట వరం లాంటిదని, గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మనోజ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పల్లెపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. పేదల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25లక్షల వరకు పెంచి కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సచివాలయం పరిధిలోని 503 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా 8 మందిని ఆదోనికి రెఫర్ చేశారు. అలాగే కంటి పరీక్షలు చేసి అద్దాలు అందించేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ భానుశ్రీ, ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ గిరి, ఏఎన్ఎం పద్మవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


స్పీడు బ్రేకర్లు లేక ప్రమాదాలు



స్పీడు బ్రేకర్లు వేయాల్సిన ప్రాంతం ఇదే

ఆదోనిఅర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు వేసి ప్రమాదాలను నివారించాలని కమీషన్ ఏజెంట్లు, వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు యార్డు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు ఎనిమిది ప్రమాదాలు జరిగాయని, స్కూటరిస్టులు, ఆటోలు, ఎద్దులబండ్లు, ట్రాన్స్‌పోర్టు వాహనాలు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యారని తెలిపారు. ఒకవైపు వేరుశనగకాయల మార్కెట్ ఉండగా, మరోవైపు పత్తి మార్కెట్, మరో వైపు బయట నుంచి దిగుబడులు వస్తుండడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడండి



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి

ఎమ్మిగనూరురూరల్: రానున్న స్వార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం ఉన్నతాధికారులకు అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించి ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. తహసీల్దార్లు శేషారెడ్డి, ఓబులేసు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఎన్నికల డీటీ గురురాజారావు తదితరులు పాల్గొన్నారు.

జయరాం మృతి తీరని లోటు



జయరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అరసం జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాద్, ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: అరసం జిల్లా మాజీ అధ్యక్షుడు జయరాం అకాల మృతి అరసం కర్నూలు జిల్లా శాఖకు తీరని లోటని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాద్ అన్నారు. బుధవారం నెహ్రూమెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో జయరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ జయరాం కథా వార్షికలు– వస్తు శిల్పాలు అనే అంశం మీద పరిశోధన చేసి డాక్టరేట్ పొందారన్నారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గూడూరు గ్రామ చరిత్ర పుస్తకాన్ని రాశారని చెప్పారు. కర్నూలు కవితా సంకలనానికి సంపాదకులుగా పని చేస్తూ.. అరసం అభ్యుదయ సాహిత్య విస్తృతికి కృషి చేశారన్నారు. జయరాంకు నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో అరసం కార్యవర్గ సభ్యులు సుధాకర్, రామయ్య, అంకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిర్ముడితో శ్రీశైలానికి శివస్వాములు



జ్యోతిర్ముడి కట్టుకుంటున్న శివస్వాములు

ఆదోనిఅర్బన్: మహాశివరాత్రిని పురస్కరించుకుని పట్టణంలోని ఆయా శివాలయాల్లో మండల దీక్ష చేపట్టిన శివస్వాములు జ్యోతిర్ముడి కట్టుకుని బుధవారం శ్రీశైలానికి బయలుదేరారు. స్థానిక శ్రీ శంభు లింగేశ్వరస్వామి దేవాలయంలో గురుస్వామి శైలేంద్రనాథ్ ఆధ్వర్యంలో మూడు కాయలు, పసుపు, కుంకుమ, గంధం, చక్కెర, ఆగరబత్తి, బియ్యం స్వామివారికి నైవేద్యంగా జ్యోతిర్ముడి కట్టుకుని శ్రీశైలానికి పయనమయ్యారు. కొంత మంది వెంకటాపురం వరకు వెళ్లి అక్కడి నుంచి పాదయాత్రగా, మరి కొంత మంది నేరుగా శ్రీశైలానికి బయలుదేరారు.